# నో స్మోకింగ్

~ స్టీఫెన్ కింగ్ (అనువాదం: వెంకట్ సిద్ధారెడ్డి)



**సినిమా వెనుక కథ:** నో స్మోకింగ్

**రచన:** స్టీఫెన్ కింగ్

**అనువాదం:** వెంకట్ సిద్దారెడ్డి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=1496

©Author.

**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

*ప్రముఖ రచయిత స్టీఫెన్ కింగ్ రాసిన కథ “Quitters, Inc.” ఇలాంటి కథ తో మొదట “టేల్స్ ఫ్రం ది డార్క్ సైడ్” అనే టివి సీరీస్ లో “బిగోలోస్ లాస్ట్ స్మోక్” అనే ఒక ఎపిసోడ్ వచ్చింది. ఆ తర్వాత ఈ కథ ఆధారంగా రెండు చలనచిత్రాలు రూపొందించబడ్డాయి; ఒకటి హాలీవుడ్ లో, మరొకటి బాలీవుడ్ లో. హాలీవుడ్ లో “నైట్ షిఫ్ట్” అని మూడు లఘు చిత్రాలతో కూడిన సంకలనంలో ఒక భాగంగా “క్యాట్స్ ఐ” పేరుతో ఈ కథ చలనచిత్రంగా రూపుదిద్దుకొంది. తర్వాత కొన్ని సంవత్సరాల క్రితం, హిందీలో “నో స్మోకింగ్” పేరుతో అనురాగ్ కశ్యప్ ఈ కథ అధారంగా ఒక సినిమా రూపొందించారు. “క్యాట్స్ ఐ” లో అసలు కథను యధాతథంగా నే ఉంచారు. “నో స్మోకింగ్” లో మాత్రం ఎత్తుగడ మాత్రమే తీసుకున్నారు. సిగరెట్ తాగని వాళ్లకు సిగరెట్ తాగే వాళ్లను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. అందులో ఏముందనో పొద్దస్తమానం కాలుస్తూనే ఉంటరని వీళ్ల అభిప్రాయం. సిగరెట్ తాగే వాళ్లకి సిగరెట్ తాగని వాళ్లంటే కొంచెం చిన్నచూపు కూడా ఉంటుంది. తామనుభవిస్తున్న మజా వాళ్ళకి తెలియదని వీళ్ల అభిప్రాయం. ఎలా చూసినా ఈ సిగరెట్ తాగడం అనేది ఒక గమ్మత్తైన విషయం. తాగేవాళ్లకే ఆ విషయం తెలుస్తుంది. సిగరెట్ తాగేవాళ్లల్లో చాలామంది రోజు సిగరెట్ మానెయ్యాలనే అనుకుంటుంటారు. కానీ కుదరదు. సిగరెట్ తాగడమనే వ్యసనం ముఖ్య అంశంగా నడిచే కథే, ఈ నెల సినిమా వెనుక కథ.*

*– వెంకట్ సిద్దారెడ్డి*

# నో స్మోకింగ్

మౌళికి పరమ చిరాగ్గా ఉంది. కొద్ది సేపటి క్రితమే, ముంబై నుంచి హైదరాబాద్ వెళ్లవలసిన ఫ్లైట్ నెంబర్ AI24706 మరో గంట ఆలస్యంగా రాబోతుందని డిస్ప్లే చేశారు. క్లయింటుతో మీటింగ్ ముగించుకుని హడావుడిగా ఎయిర్‌పోర్ట్ చేరుకుని మూడు గంటలయింది. లౌంజ్ లో కూర్చుని ఐపాడ్ లో ఆఫీస్ మైల్ మరోసారి చెక్ చేసుకున్నాడు; కొత్త మైల్స్ ఏవీ రాలేదు. చిరాగ్గా ఐపాడ్ బ్యాగ్ లో పెట్టుకుని స్మోకింగ్ లౌంజ్ వైపు నడిచాడు.

ఎయిర్‌పోర్ట్ లో స్మోకింగ్ చెయ్యడమంత నరకం ఇంకోటి లేదు. సరిగ్గా నలుగురు కూడా నిలబడి లేని చిన్న గదిలో ఒక యాభై అరవై మంది సీరియస్ గా సిగరెట్ తాగుతుంటారు. అయినా తప్పదు; సిగరెట్ కాల్చకుండా కాసేపైనా కుదురుగా ఉండలేడతను.

స్మోకింగ్ లౌంజ్ లోపలకి వెళ్లి సిగరెట్ ప్యాకెట్ బయటకు తీశాడు. ఖాళీ పెట్టె! తెచ్చుకున్న హాఫ్ ప్యాకెట్ ఫుల్గా తాగేశాడని అర్థమైంది. ఎయిర్‌పోర్ట్ లో సిగరెట్స్ దొరికి చావవు. పోనీ అక్కడ సిగరెట్ తాగుతున్న ఎవర్నైనా అడుగుదామనుకున్నాడు, కానీ ఒక్క మొహం కూడా అప్రోచబుల్ గా అనిపించలేదు. "ఛ. ఇంకోగంట," అనుకుంటూ విసుగ్గా బయటకు వచ్చాడు. చకచకా కింద ఫ్లోర్ లో ఉన్న బార్ లోకి నడిచాడు.

"చెప్పండి సార్?"

"ఒక లార్జ్ యాంటిక్విటీ బ్లూ. ఒక ప్యాకెట్ లైట్స్".

"ఇంకేమైనా కావాలా సర్?"

"అంతే"

"ఎనిమిది వందల డెబ్బై మూడు అయింది సార్. క్యాషా? కార్డా?"

క్రెడిట్ కార్డ్ ఇచ్చాడు మౌళి. గతంలో ఒకసారి బెంగుళూరు ఎయిర్‌పోర్ట్ లో ఇలాంటి పరిస్థితే ఎదురైంది కానీ, మరీ ఇంత ఖర్చవుతుందని మాత్రం అనుకోలేదు మౌళి. అయినా అవన్నీ ఆలోచించే పరిస్థితిలో లేడతను. ఒకసారి సిగరెట్ తాగాలనిపించాక తాగాల్సిందే!

అరనిమిషంలో హడావుడిగా సిగరెట్ కాల్చేసాక కానీ అతని మనసు స్థిమితపడలేదు. బ్యాగ్ లోనుంచి ఐప్యాడ్ తీసి మరోసారి మైల్ చెక్ చేసుకున్నాడు. మైల్స్ ఏమీ లేవు. ఇంతలో విస్కీ పట్టుకొని వచ్చాడు వెయిటర్. నెమ్మదిగా విస్కీ తాగుతూ మరో సిగరెట్ వెలిగించి చుట్టూ చూశాడు. బార్ లో జనాలు పెద్దగా లేరు. అతను కూర్చున్న రెండు టేబుళ్ళకవతల ఒక వ్యక్తి ల్యాప్ టాప్ లో ఏదో టైప్ చేస్తున్నాడు. తనలాగే సేల్స్ వాడెవడో అయ్యుంటాడని అనుకున్నాడు. విస్కీ మరో సిప్ చేసి సిగరెట్ తాగుతుండగా ఆ వ్యక్తి తలెత్తి మౌళి వైపు చూశాడు. ఇద్దరి చూపులూ కలిశాయి. "వీడెవడ్రా బాబూ నన్నే చూస్తున్నాడు," అనుకుంటూ ఐప్యాడ్ లో తలదూర్చే ప్రయత్నం చేస్తుండగా, "అరే వీడు శ్రీకాంత్ గాడు కదా!" అనుకుంటూ అతని వైపు చూశాడు. ఈ లోపలే ఆ వ్యక్తి తన టేబుల్ దగ్గర్నుంచి లేచి, "అరే మౌళీ!" అంటూ దగ్గరకు వచ్చాడు.

అవును అతను శ్రీకాంతే. "ఏంట్రా ఇలా మారిపోయావు? నువ్వే అనుకున్నాను. కానీ..." అంటూ శ్రీకాంత్ని కిందనుంచి పైకి ఒకసారి చూశాడు. ఎప్పుడూ చేతిలో సిగెరెట్, సోడాబుడ్డి కళ్ళద్దాలు, గాలొస్తే ఎగిరిపోయేలాంటి ఆకారం. ఏడేళ్ల క్రితం తనకు తెలిసిన శ్రీకాంత్ కీ ఇప్పుడు తన కళ్లముందున్న శ్రీకాంత్ కీ అసలు పోలికే లేదు.

"మౌళీ! ఎన్నిరోజులైందిబే. నువ్వేంటిక్కడ?"

"క్లయింట్ తో మీటింగ్ రా! కానీ నువ్వేంట్రా ఇలా అయిపోయావ్? బక్కగా ఉండేవాడివి. కొంపతీసి సిక్స్ ప్యాకా ఏంటి?"

"అంతలేదురా! నువ్వు మాత్రం ఇంకా అప్పట్లానే మంచి ఫిట్ గా ఉన్నావే?"

ఏదో శ్రీకాంత్ మాటవరసకు అనుంటాడని మౌళికి తెలుసు. లేకపోతే షర్ట్ లోనుంచి తోసుకొస్తున్న పొట్ట, కళ్లకింద నలుపు, ఉబ్బిపోయిన మొహం చూస్తే ఎవరూ అతను ఫిట్ గా ఉన్నారని అనరు.

"నువ్వూ హైదరాబాదేనా?" అడిగాడు మౌళి.

"లేదు. ఢిల్లీ వెళ్తున్నాను. కొత్త క్లయింట్. రేప్పొద్దున మీటింగ్. తగిలిందంటే జాక్‌పాటే!" చెప్పాడు శ్రీకాంత్.

"ఇంకా అదే కంపెనీ లో ఉన్నావా?"

"యెస్. విపి,సేల్స్"

శ్రీకాంత్ చెప్పింది వినగానే మౌళికి కడుపులో మంటగా అనిపించింది.నిజానికి శ్రీకాంత్ని చూడగానే అతనికి కడుపులో మంట మొదలైంది. ఇద్దరూ కలిసి ఒకే రోజు ఉద్యోగం లో చేరారు. నాలుగేళ్లు పని చేశాక శ్రీకాంత్ వేరే కంపెనీ కి వెళ్లిపోయాడు. మౌళి మాత్రం పదేళ్లనుంచి అదే కంపెనీ! "వైస్ ప్రెసిడెంట్ సేల్స్. సీనియర్ సేల్స్ మేనేజర్." మనసులో అనుకున్నాడు మౌళి. కొంచెం అసూయగా అనిపించింది. బహుశా తన కడుపులో మంటకు అదే కారణమేమో అనుకున్నాడు కానీ, ఇంతలోనే మధ్యాహ్నం హోటల్లో తిన్న భోజనం మీద నింద మోపేసాడు.

శ్రీకాంత్ తన బ్యాగ్ ప్యాక్ చేసుకుని వచ్చి మౌళి టేబుల్ దగ్గరే కూర్చున్నాడు.

"వి.పి సేల్స్! గ్రేట్ మ్యాన్. ప్రమోషన్ ఎప్పుడొచ్చింది. లాస్ట్ ఇయర్ కృష్ణ కలిశాడు. వాడు కూడా చెప్పలేదు," అంటూ శ్రీకాంత్ హ్యాండ్ షేక్ చేశాడు మౌళి.

"అప్పటికి ఇంకా ప్రమోషన్ రాలేదు రా! అంతా సడెన్ గా జరిగిపోయింది. మూడు నెలల్లో నా జీవితమే మారిపోయింది," అంటూ ఆగి విస్కీ తాగుతూ మౌళి వైపు అదోలా చూసి, "నీకు టైముందా?" అడిగాడు.

"ఫ్లైటు నాలుగు గంటలు లేటు"

"ఇంకో పెగ్ చెప్దామా?" అడిగాడు శ్రీకాంత్.

వెయిటర్ని పిలిచి రెండు డ్రింక్స్ ఆర్డర్ చేశాడు శ్రీకాంత్. మౌళి మరో సిగరెట్ వెలిగించబోతూ శ్రీకాంత్ కి ఆఫర్ చేశాడు.

"నేను మానేశాను" అన్నాడు నవ్వుతూ.

"నిజంగానా? ఎప్పుడు?"

"పోయిన డిశెంబర్ లో. ఆ రోజులు ఎప్పటికీ మర్చిపోలేను. ఆఫీస్ లో వర్క్ టెన్షన్స్. టార్గెట్స్ మీట్ అవటం లేదని బాస్ గోల. నేనసలు ఇంటికే రావటం లేదని లత అలిగి పిల్లలతో వాళ్లింటికి వెళ్లిపోయింది. టెన్షన్ తో సిగరెట్లు ఎక్కువ కాల్చేశాను. హెల్త్ బాగా పాడయింది. కడుపులో నొప్పిగా ఉంటే డాక్టర్ దగ్గరకు వెళ్లాను. అల్సర్ అని చెప్పాడు. సిగరెట్ మానకపోతే డేంజర్ అన్నాడు. లత తిరిగి వచ్చింది. సిగరెట్ తాగితే నా మీద ఒట్టే అని కూర్చుంది. అయినా నా వల్ల కాలేదు."

శ్రీకాంత్ చెప్తున్నది వింటూ సిగరెట్ని సగంలోనే యాష్ ట్రే లో పడేశాడు మౌళి.

"మరి ఎలా మానేశావ్?" అడిగాడు మౌళి.

"కొన్ని రోజులునిజంగానే సీరియస్ గా ప్రయత్నించాను. కానీ చాలా రోజులు లతకి తెలియకుండా తాగుతూ వచ్చాను. లతకి తెలిసిపోయి మళ్ళీ హైదరాబాద్ వెళ్లిపోయింది. లత కోసం హైదరాబాద్ వచ్చినప్పుడు ఒకతను పరిచయమయ్యాడు. హైదరబాద్ లో సిగరెట్ మాన్పించే ఒక ప్లేస్ గురించి చెప్పాడు. గ్యారెంటీ రిజల్ట్స్ అన్నాడు. ప్రయత్నిస్తే తప్పేముందని వెళ్లాను. ఆ రోజునుంచి ఈ రోజు వరకూ ఒక్క సిగరెట్ కూడా తాగలేదు."

చూస్తుంటే శ్రీకాంత్ గాడు తనకేదో చైన్ మార్కెటింగ్ స్కీమ్ లో మెంబర్ గా చేర్పించే ప్లాన్ ఏదో వేశాడని అనిపించింది మౌళికి. "ఏం చేశారు వాళ్లు? ఏవైనా మందులిచ్చారా?" కళ్లు పెద్దవి చేసి అడిగాడు మౌళి.

“అలాంటిదేం లేదు,” అంటూ పర్స్ తీసి నలిగిపోయిన ఒక విజిటింగ్ కార్డ్ ఇచ్చాడు శ్రీకాంత్. “వీళ్లే. నా చేత సిగరెట్ మాన్పించింది. నీకు ఇంట్రెస్ట్ ఉంటే కాంటాక్ట్ చెయ్యి.”

“నివారణ్”

మహేశ్వరం గ్రామం, శ్రీశైలం హైవే

హైదరాబాద్

By appointment only

కార్డ్ వెనక్కి తిప్పి చూశాడు మౌళి. ఫోన్ నెంబర్, ఈ–మెయిల్ లాంటి వివరాలు ఏమీ లేవు. మరో సారి కార్డ్ వైపు తీక్షణంగా చూసి,

“నిజంగా మాన్పిస్తారా?” అడిగాడు.

“నేను గ్యారెంటీ”

“ఎలా మాన్పిస్తారు?”

“అది చెప్పలేను. చెప్పకూడదు”

“ఏం?”

“మనం సైన్ చేసే కాంట్రాక్ట్ ప్రకారం వారి పద్ధతుల గురించి ఎవరికీ చెప్పకూడదు”

“కాంట్రాక్ట్ సైన్ చెయ్యాలా?”

అవునన్నట్టు తలూపాడు శ్రీకాంత్.

ఖచ్చితంగా, ఏదో దగుల్బాజీ చైన్ మార్కెటింగ్ కంపెనీలో తనని చేర్పించడానికి శ్రీకాంత్ ప్రయత్నం చేస్తున్నాడని మౌళి సేల్స్ బుర్ర గ్రహించింది.

“ఈ మధ్య ‘No addiction powder’ అని టివిలో ఊదరగొడ్తున్నారు. కొంపతీసి ఆ పౌడర్ ఇస్తారా ఏంటి?”

“నీకు సిగరెట్ మానెయ్యాలనుంటే వెళ్లు. నేను గ్యారెంటీ ఇస్తున్నాను. అంతకంటే ఏం చెప్పలేను.”

"అంత గ్యారెంటీ ఇచ్చే వాళ్లయితే, వీళ్ల గురించి ఎక్కడా వినలేదే! పేపర్లో, టివిలో... కనీసం పోస్టర్స్ కూడా చూడలేదు"

"మౌత్ టాక్ని మించిన పబ్లిసిటీ ఉంటుందా?"

"వామ్మో, నువ్వేంట్రా! ఈ కంపెనీ కి బ్రాండ్ అంబాసిడర్ లా మాట్లాడుతున్నావు."

శ్రీకాంత్ ఏం మాట్లాడలేదు. మౌళి వైపు చూసి అదోలా నవ్వాడు.

"ఒకవేళ ఎయిర్పోర్ట్ స్మోకింగ్ రూం లాంటి దాంట్లో మనల్ని బంధించి వరసగా సిగెరెట్స్ తాగిపిస్తారా ఏంటి?" సిగెరెట్ వెలిగిస్తూ అడిగాడు మౌళి.

"నీకునిజంగా మానాలని ఉంటే చెప్పు. అంతే కానీ... వాళ్ల గురించి ఏమీ చెప్పలేను."

"మానాలనే ఉంది. కానీ..."

"నా మాట నమ్ము. సిగెరెట్ మానేశాక నా జీవితం మారిపోయింది. జీవితం చాలా ప్రశాంతంగా ఉంది."

"నువ్వు ప్రశాంతంగానే ఉన్నావు రా. నాకీ విషయం సగం సగం చెప్పి టెన్షన్ లో పెట్టేశావు."

ఈలోగా ముంబై నుంచి ఢిల్లీ వెళ్లే ఫ్లైట్ బోర్డింగ్ అవుతున్నట్టుగా ఎనౌన్స్మెంట్ రావడంతో శ్రీకాంత్ బయల్దేరడానికి సిద్ధమయ్యాడు. "ఇప్పుడు కాకపోయినా ఎప్పుడైనా మానాలనిపిస్తే ట్రై చెయ్యి" అని బయల్దేరాడు .

"అంతేకానీ ఆ రహస్యం మాత్రం చెప్పనంటావు," అడిగాడు మౌళి.

"నోవే" అంటూ బ్యాగ్ తీసుకుని లేచాడు శ్రీకాంత్.

"మరి వెయిట్ పెరగలేదా?" కుతూహలంగా అడిగాడు మౌళి.

"మొదట కాస్త లావయ్యాను. కానీ కంట్రోల్ లోకి తెచ్చుకున్నాను," అంటూ బిల్ కట్టేసి "ఆల్ ది బెస్ట్" అంటూ హడావుడిగా వెళ్లిపోయాడు.

శ్రీకాంత్ ఇచ్చిన విజిటింగ్ కార్డ్ని మరోసారి పూర్తిగా స్టడీ చేసి పర్స్ లో పెట్టుకున్నాడు మౌళి.

ఆ రోజు పర్స్ లో పెట్టుకున్న ఆ విజిటింగ్ కార్డ్ సంగతే మర్చిపోయాడు మౌళి. ఆరు నెలల తర్వాత ఒక రోజు శ్రీశైలం హైవే లో రియల్ ఎస్టేట్ పని మీద వెళ్లినప్పుడు, అక్కడెవరికో తన విజిటింగ్ కార్డ్ ఇవ్వబోతుండగా "నివారణ్" కార్డ్ కనిపించింది. శ్రీకాంత్తో ఆ రోజు ఎయిర్పోర్ట్లో జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది. తన స్థలం కొంటానని వచ్చిన అక్కడి వ్యక్తిని నివారణ్ గురించి అడుగుదామనిపించింది. కానీ ప్లాట్ కొనడంలో బేరం కుదరక ఆ వ్యక్తి కోపంగా వెళ్లిపోయాడు.

ఆఫీస్ లో సేల్స్ టార్గెట్స్ ఎక్కువైపోయాయి మౌళికి. టార్గెట్స్ రీచ్ కాకపోతే కమీషన్స్ సరిగ్గా రావటం లేదు. పిల్లాడిని మంచి స్కూల్లో చేర్పించాలి. ఎప్పుడో కొన్న ప్లాట్ అమ్ముదామంటే మంచి రేట్ లేదు; ఎంతోకొంతకు అమ్ముదామన్నా కొనేవాడే లేడు. ఇవన్నీ కాకుండా ఈ మధ్య విపరీతమైన దగ్గు.

శ్రీకాంత్ చెప్పినట్టు సిగరెట్ మానేస్తే ఎలా ఉంటుంది అని ఒక ఆలోచన వచ్చింది మౌళికి. "సరే ప్రయత్నిస్తే తప్పేముంది. పోతే గీతే శ్రీకాంత్ విప్పని రహస్యమైనా తెలుస్తుంది కదా!" అనుకుని విజిటింగ్ కార్డ్ వైపు మరోసారి చూసుకుని కారు మహేశ్వరం వైపు పోనిచ్చాడు.

నివారణ్ ఆశ్రమం కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. ఊరి బయట ఖాళీ ప్రదేశం లో చాలా విశాలమైన ప్రదేశంలో ఉందా ఆశ్రమం. ఎత్తైన ప్రహరీ గోడ, గోడ పైన సోలార్ ఫెన్సింగ్, ప్రవేశ ద్వారంలో నలుగురు సెక్యూరిటీ గార్డ్స్. "ప్రభుత్వం దగ్గర్నుంచి ఫ్రీగా స్థలం కొట్టేసుంటారు," అనుకున్నాడు మౌళి.

గేట్ దగ్గర సెక్యూరిటీ గార్డ్స్ కారాపారు. పదినిమిషాల పాటు చెకింగ్ చేసి లోపలకి పంపించారు. లోపల చూడ్డానికి చాలా ప్రశాంతంగా ఉంది. మనుషులెవరూ లేరు. దూరంగా కనిపించిన ఒక బిల్డింగ్ దగ్గర కారాపాడు. పార్కింగ్లో మరో ఐదారు కార్లున్నాయి. అన్నీ ఖరీదైనా కార్లే. "ఫీజు ఎక్కువుంటుందేమో!" అనుకుంటూ లోపలకి నడిచాడు.

రిసెప్షన్ హాల్ చాలా శుభ్రంగా ఉంది. రిసెప్షనిస్ట్ కంప్యూటర్ లో ఏదో టైప్ చేస్తోంది. హాల్లో నలుగురు వ్యక్తులు మౌనంగా కూర్చుని ఉన్నారు. మౌళి రావడం చూసి రిసెప్షనిస్ట్ చిరునవ్వుతో పలకరించింది.

మౌళి తన చేతిలో ఉన్న విజిటింగ్ కార్డ్ తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"మీ పేరు?" అడిగిందామె.

"చంద్ర మౌళి"

కంప్యూటర్ లో టైప్ చేస్తూ ప్రశ్నలడగసాగిందామె.

"అడ్రస్?"

"ఫ్లాట్ నెం 121, బంజారా కిరణ్ అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 12, బంజారా హిల్స్."

"పెళ్లయిందా?"

"అయింది."

"పిల్లలు"

"ఒకరు"

"మా ఆశ్రమాన్ని మీకు పరిచయం చేసింది ఎవరు?"

"శ్రీకాంత్ శర్మ. నా స్నేహితుడు"

"మీ వివరాలు తెలియచేసినందుకు కృతజ్ఞతలు. మీ టోకెన్ నెంబర్ 5. కాసేపు మీరక్కడ వెయిట్ చెయ్యండి" అని హాల్లో ఉన్న కుర్చీ వైపు చూపించింది.



అక్కడ మౌనంగా కూర్చున్న వాళ్లవైపు చూశాడు మౌళి. ఎందుకో తను కూడా వారిలా అక్కడ కూర్చోవడం నచ్చలేదతనికి. బయటకెళ్లి ఒక సిగెరెట్ తాగివద్దామనుకున్నాడు. జేబులోనుంచి సిగెరెట్ ప్యాకెట్ తీశాడు. అగ్గిపెట్టె లేదు. "షిట్" అనుకున్నాడు. రిసెప్షనిస్ట్ని అగ్గిపెట్టె అడగడం అంత బావుండదేమో అనిపించింది. పోనీ అక్కడ కూర్చున్న వాళ్లని అడిగితే? వాళ్లు శిలల్లా కూర్చుని ఉన్నారు. సిగెరెట్ తాగే ఆలోచనను కాసేపటికి వాయిదా వేసి కుర్చీలో కూర్చుని పక్కనే ఉన్న ఒక పత్రిక తీసి తిరగేశాడు.

తనకంటే ముందే అక్కడ కూర్చుని ఉన్న వాళ్ళు ఒక్కొక్కరూ ఐదు, పదినిమిషాల గడువులో లోపలకి వెళ్లారు; ఒక్కరూ తిరిగి రాలేదు. లోపల వాళ్లకి "ముఖేష్ – నో స్మోకింగ్ ఎడ్వర్టయిజ్మెంట్"

లాంటివి చూపిస్తుంటారని ఊహించుకున్నాడు మౌళి. కాసేపటికి ఒక వ్యక్తి హాల్లోకి వచ్చాడు. "చంద్రమౌళి గారూ," అన్నాడు. మ్యాగజైన్ చదవడంలోనిమగ్నమైపోయిన మౌళి తలెత్తి ఆ వచ్చిన వ్యక్తి వైపు చూశాడు. అతన్ని చూస్తే అప్పుడెప్పుడో ఇస్కాన్ గుడికి వెళ్లినప్పుడు అక్కడ చూసిన కృష్ణ భక్తులు గుర్తొచ్చారెందుకో! లేచి వెళ్లి హ్యాండ్ షేక్ చేద్దామనుకున్నాడు. లేత కాషాయం రంగు కుర్తా, అదే రంగు ప్యాంట్స్ ధరించి స్వామీజీ లా ఉన్న అతనికి నమస్కారం చేశాడు.

అతను కూడా ప్రతి నమస్కారం చేసి, "రండి" అంటూ లోపలకి నడిచాడు. మౌళి వినయంగా అతనివెంటే వెళ్లాడు.

లోపల చాలా గదులు ఉన్నాయి. అన్ని గదులున్నా లోపల మాత్రం చాలానిశబ్దంగా ఉంది. "బహుశా సౌండ్ ప్రూఫ్ గదులు అయ్యుంటాయేమో," అనుకున్నాడు మౌళి.

మౌళిని లోపలకి తీసుకువచ్చిన వ్యక్తి ఒక గది దగ్గర ఆగి జేబులోనుంచి తాళం చెవి తీసి గది తలుపు తెరిచాడు. మౌళి అతన్నే ఆసక్తిగా గమనిస్తుండడంతో, ఆ వ్యక్తి మౌళి వైపు చూసి ఒక చిత్రమైన చిరునవ్వు చిందించాడు. ఆ నవ్వుకు అర్థమేంటో మౌళికి అర్థం కాలేదు.

గదిలోకి ప్రవేశించగానే గోడ మీద ఉన్న పెద్ద ఫోటో ఫ్రేమ్ లు కనిపించాయి మౌళికి. ఒక ఫోటోలో స్వామిజీ లాంటి వ్యక్తినిలబడి ఉన్నాడు. మరో ఫోటోలో కోట్ ధరించిన వ్యక్తి దర్జాగానిలబడి ఉన్నాడు. ఆ ఫోటోలు చూడగానే వాళ్ళనెక్కడో చూసినట్టుందే అనుకున్నాడు మౌళి. ఒక గోడకు పెద్ద కిటికీ లాంటిది ఉంది. కానీ ఆ కిటికీ కనిపించకుండా కర్టెన్ వేలాడతీసి ఉంది. గది మధ్యలో నేల మీద చిన్న టేబుల్ ఒకటుంది. దానికి రెండు వైపులా కుర్చీలు ఉన్నాయి.

"కూర్చోండి" అన్నాడా వ్యక్తి.

మౌళి కూర్చోగానే, మరోసారి నమస్కారం చేసి మొదలుపెట్టాడతను. "నా పేరు బాబా కృష్ణదేవ్. మీ చేత సిగరెట్ మాన్పించడంలో అన్ని విధాలా సహాయపడడం నా బాధ్యత."

మౌళికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. కాసేపటికి "నమస్తే కృష్ణ గారూ" అన్నాడు. కానీ మౌళికి అర్జెంట్గా సిగరెట్ తాగాలనిపించింది.

మౌళి కళ్లల్లోకి సూటిగా చూశాడు బాబా. డెస్క్ తెరిచి ఒక పేపర్ బయటకు తీశాడతను. "మీరునిజంగా సిగరెట్ మానెయ్యాలనుకుంటూన్నారా?" సీరియస్ గా అడిగాడు.

గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు మౌళి. "అవును" అన్నాడు.

"అయితే మీరీ కాంట్రాక్ట్ మీద సంతకం చెయ్యాల్సి ఉంటుంది," అంటూ కాంట్రాక్ట్ కి సంబంధించిన కాగితాలను మౌళికి అందించాడు.

మౌళి కాంట్రాక్ట్ మొత్తం చదివాడు. ఇక్కడ ఉపయోగించే పద్ధతుల గురించి బయట ఎవరికీ చెప్పకూడదనే విషయం తప్పితే మిగతా విషయాలన్నీ మామూలుగానే ఉన్నాయి. అసలు ఈ ఆశ్రమంలో వాడే పద్ధతులేంటో తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువైంది మౌళికి. వెంటనే వేరే ఆలోచన లేకుండా కాంట్రాక్ట్ మీద సంతకం చేసేశాడు.

బాబా కూడా కాంట్రాక్ట్ మీద సంతకం చేసి, కాగితాలను జాగ్రత్తగా డెస్క్ లోపల పెట్టేశాడు.

"మరి ఫీజ్ ఎంతో..." అని అడగబోయాడు మౌళి.

"ఫీజ్ గురించి మీరు అసలు వర్రీ కాకండి. మీరు సిగరెట్ పూర్తిగా మానేసిన తర్వాత సంవత్సరం వరకూ మీరు మాకేవిధమైన ఫీజ్ చెల్లించక్కర్లేదు."

"నిజమా?"

"శ్రీకాంత్ గారు మీకీ విషయం చెప్పలేదా?"

"చెప్పలేదు. కానీ ఫీజ్ లేకుండా..." అని ఏదో అడగబోయాడు మౌళి.

"చూడండి మిస్టర్ మౌళి. పొగ త్రాగడం అనేది చాలా తీవ్రమైన వ్యసనం. అది మాన్పించడానికి మేము కొన్ని ప్రత్యేకమైన పద్ధతులు రూపొందించాం." అని బాబా ఇంకా ఏదో చెప్పబోయాడు.

"అంటే ఏదైనా మందులు, అవీ..." అని ఆగిపోయాడు మౌళి.

బాబా సూటిగా మౌళి కళ్ళల్లోకి చూశాడు. మౌళి అతని కళ్ళల్లోకి చూడలేక పోయాడు.

"మీరు అనుకుంటున్నట్టుగా మా ట్రీట్మెంట్ ఉండదు. మీరు ప్రత్యేకంగా ఏ విధమైన మందులు తీసుకోనక్కర్లేదు. తిండి విషయంలో కూడా ఎటువంటి ఆంక్షలు విధించము. సిగరెట్ తాగడం ద్వారా వచ్చే దుష్ఫలితాల గురించి ఉపదేశం చెయ్యము. అంతే కాదు. అసలు మీరు సిగరెట్ ఎందుకు మానాలనుకుంటున్నారని కానీ, దాని వెనుక ఉన్న ఇతర కారణాల గురించి కానీ మాకు అవసరం లేదు. మా ట్రీట్‌మెంట్ చాలా ప్రాక్టికల్ గా ఉంటుంది. నన్ను నమ్మండి."

బాబా విశ్వాసాన్ని చూసి మౌళికి ముచ్చటేసింది . "నా సంగతి వీళ్లకు తెలియదు," అనుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.

"ట్రీట్‌మెంట్ మొదలు పెట్టే ముందు మీరు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది"

"ఇప్పుడే కదా ఏమీ అడగకుండా మాన్పించేస్తామని గొప్పలు పోయాడు. అప్పుడే మాట మార్చేశాడు. బాబా బ్లాక్ షీప్ దొరికిపోయాడు" అని మనసులోనే అనుకుంటూ, "అడగండి" అన్నాడు మౌళి.

"మీ భార్య పేరు?"

"స్వాతి"

"మీకు మీ భార్య అంటే ఇష్టమేనా?"

మౌళి ఉలిక్కిపడ్డాడు. బాబా వైపు చూశాడు. మౌళి సమాధానం కోసం ఎదురుచూస్తూ ప్రశాంతంగా ఉన్నాడు బాబా. "అవును ఇష్టమే," అని ముభావంగా చెప్పాడు.

"మీరు ఎపుడైనా మీ భార్యతో గొడవపడ్డారా? అంటే విడాకులు తీసుకుందామనేంత పెద్ద గొడవ!" అడిగాడు బాబా.

"మీరు నా చేత సిగెరెట్ మాన్పిస్తారా లేక మ్యారేజ్ కౌన్సిలింగ్ చేస్తారా?"

"దయచేసి నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి."

"లేదు. మా మధ్య పెద్ద గొడవలేమీ లేవు."

"గుడ్. మీకు ఒక్కరే అబ్బాయి కదా?"

"అవును."

"ఏ స్కూల్?"

"మిమ్మల్ని సార్ అనాలో స్వామీ అనాలో నాకు తెలియదు. మీకు నా పర్సనల్ డిటైల్స్ తో అవసరమేంటో నాకర్థం కావటం లేదు" కొంచెం కోపంగా అడిగాడు మౌళి.

"సరే. మీ కోపాన్ని అర్థం చేసుకోగలను. రేపట్నుంచి ట్రీట్‌మెంట్ మొదలుపెడదాం. అప్పుడు మీ అనుమానాలన్నీ తీరిపోతాయి," అంటూ అక్కడ్నుంచి లేచాడు బాబా. మౌళి కూడా లేచి నుంచున్నాడు. బాబా ఇంక వెళ్లొచ్చన్నట్టుగా నమస్కారం చేశాడు. మౌళి అక్కడ్నుంచి వెళ్తుండగా,

“ఈ రాత్రికి మీరు ఎన్ని సిగెరెట్లు తాగాలనుకుంటే తాగండి. ఆ తర్వాత మీరు తాగాలన్నా తాగలేరు” అన్నాడు బాబా.

మౌళి ఏం మాట్లాడలేదు. “ఈ బాబా గాడికి చాలా ఓవర్ కాన్ఫిడెన్స్,” అనుకున్నాడు మనసులో.

రాత్రంతా సరిగ్గానిద్ర పట్టలేదు మౌళికి. ఉదయం లేచి ఆఫీస్ కి వెళ్లాడు కానీ, మనసంతా సిగెరెట్ మీదే! పదినిమిషాలకొకసారి వెళ్లి సిగెరెట్ తాగాడు. మధ్యాహ్నం మూడింటికి మహేశ్వరం బయల్దేరాడు. అనవసరంగా టైం వేస్ట్ చేస్తున్నానేమో అనుకున్నాడు. శంషాబాద్ దగ్గరకు రాగానే కారాపి మరో సిగెరెట్ తాగాడు. ఎందుకీ గొడవ. వెనక్కి వెళ్లిపోదామని అనుకున్నాడు. కానీ శ్రీకాంత్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. “నా మాట నమ్ము. సిగెరెట్ మానేశాక నా జీవితం మారిపోయింది. జీవితం చాలా ప్రశాంతంగా ఉంది.” ఏమో సిగెరెట్ మానేస్తే తన జీవితం కూడా మారిపోతుందేమో అనిపించింది. కారు ఆశ్రమం దగ్గరకు రాగానే మరో సిగెరెట్ వెలిగించాడు. “కొంపతీసి జీవితంలో ఇదే అఖరి సిగెరెట్టా?” అని ఆలోచిస్తూ ఫిల్టర్ కాలేవరకూ సిగెరెట్ కాల్చాడు. నోరు చేదుగా అయింది. చిరాగ్గా సిగెరెట్ పీకను కిందపడేసి కసిగా తొక్కి ఆశ్రమంలోపలకి కారు పోనిచ్చాడు.

రిసెప్షన్ హాల్లో పది మందికి పైనే ఉన్నారు. “వీళ్ల వ్యాపారమే బావున్నట్టుంది,” అనుకున్నాడు మౌళి. ఐదునిమిషాలు కూర్చోగానే మళ్లీ మనసు సిగెరెట్ మీదకు మళ్లింది. బయటకెళ్లి సిగెరెట్ తాగుదామనుకుంటుండగా బాబా వచ్చేశాడు.

ముందు రోజు తీసుకెళ్లిన రూం లోకే తీసుకెళ్లాడు బాబా. గది మొత్తం అలాగే ఉంది కానీ, కిటికీకి ఉన్న కర్టెన్ మాత్రం తొలగించి ఉంది. కిటికీకి అవతలి వైపు ఏముందో సరిగ్గా కనిపించటం లేదు; కానీ అవతల మరో గది ఉన్నట్టుగా మాత్రం అర్ధమయింది మౌళికి.

“మిస్టర్ మౌళి, మీరు మా ఆశ్రమానికి తిరిగి రావడం ఆనందంగా ఉంది. మా దగ్గర కన్సల్టేషన్ కి వచ్చిన తొంభై శాతం మంది మళ్లీ ఇటువైపు రారు. మీరు ఈ రోజు వచ్చారంటే మీకు సిగెరెట్ మానెయ్యాలనే కోరిక ఎంత తీవ్రంగా ఉందో అర్ధమవుతుంది. ఈ ట్రీట్‌మెంట్ లో మీరు మొదటి అడ్డంకి దాటేసినట్టే,” అన్నాడు బాబా.

మౌళికి బాబాని చూస్తే చాలా చిరాగ్గా ఉంది. మాటలతో మాయం చేస్తున్నాడనిపించింది. "ట్రీట్‌మెంట్ ఎప్పుడు మొదలు పెడ్తారు?" అడిగాడు.

"ఆల్రెడీ మీ ట్రీట్‌మెంట్ మొదలయిపోయింది. మీ దగ్గర ఇప్పుడు సిగెరెట్స్ ఉన్నాయా?"

"ఉన్నాయి"

"ఇవ్వండి" అని చేతులు చాచాడు బాబా.

మౌళి ఇచ్చిన సిగెరెట్ ప్యాకెట్ని టీ పాయ్ మీద పెట్టాడు. ప్యాకెట్లో ఉన్న మూడు సిగెరెట్స్ని తీసి టీ పాయ్ మీద పెట్టి కొన్ని క్షణాల పాటు వాటి వైపు చూసి, ఒక్కసారిగా వాటి మీద దాడి చేశాడు బాబా. గట్టిగా అరుస్తూ, సిగెరెట్లు ముక్కలుముక్కలయ్యే వరకూ టీపాయ్ మీద గుద్దుల వర్షం కురిపించాడు. బాబా చేస్తున్న హడావుడి అంతా చూసి, వీడు కొంచెం తేడా గాడిలా ఉన్నాడే అనుకున్నాడు మౌళి.

"ఈ సిగెరెట్లు ధ్వంసం చేసే కార్యక్రమం నాకు చాలా ఇష్టమైన పని. గత మూడేళ్ళుగా రోజుకి నాలుగైదు ప్యాకెట్స్ ధ్వంసం చేస్తాను. అయినా ప్రతి సారీ కొత్తగా ఉంటుంది," పొడి పొడైన సిగెరెట్లను పక్కనే ఉన్న చెత్తకుండీలో పడేస్తూ అన్నాడు బాబా. అనుమానం లేదు. వీడునిజంగానే కొంచెం తేడా అనుకున్నాడు మౌళి.

"సరే, ఇక మనం మొదలుపెడ్దాం.నిన్న మీ అబ్బాయి దగ్గర ఆగాం కదా! మీ అబ్బాయి పేరు రఘు. వయసు 6 సంవత్సరాలు. విద్యానికేతన్ స్కూల్లో ఒకటో క్లాస్ లో చదువుతున్నాడు. ఇక మీ భార్య స్వాతి అదే స్కూల్ లో టీచర్ గా...." అని బాబా చెప్పుకుపోతున్నాడు. "ఆపండి. ఈ విషయాలన్నీ మీకెలా తెలుసు. మీరు నన్ను ఫాలో అయ్యారు కదా!" ఆవేశంగా అడిగాడు మౌళి.

"మీ గురించి మాకు అన్ని విషయాలు తెలుసు మిస్టర్ మౌళి," చెప్పాడు బాబా. "మీరేమీ కంగారు పడక్కర్లేదు. ఈ విషయాలన్నీ చాలా గోప్యంగా ఉంచబడతాయి."

"అవసరం లేదు. మీ ట్రీట్‌మెంట్ నాకు అవసరం లేదు. నేను వెళ్తున్నాను," అంటూ అక్కడ్నుంచి లెయ్యబోయాడు మౌళి.

"దయచేసి నా మాట వినండి," అంటూ లేచి, గోడ మీద ఉన్న ఫోటోల దగ్గరకు నడిచాడు బాబా. మొదటి ఫోటో చూపిస్తూ, "ఈ ఆశ్రమం స్థాపించింది ఈయనే! 1960 లలో ఇండియన్ అండర్ వరల్డ్ని శాసించిన మాఫియా డాన్. క్యాన్సర్ తో చనిపోయాడు." రెండో ఫోటో దగ్గరకు

నడిచాడు బాబా. "ఆయన కొడుకు. బిలియనీర్ బిజినెస్ మాగ్నెట్. ఎన్నో బిజినెస్ లని తన కంట్రోల్ ఉంచుకుని చివరకి సిగరెట్ మీద కంట్రోల్ లేక ముప్పై ఏళ్లకే పోయాడు."

"వాళ్ల గురించి నాకెందుకు చెప్తున్నారు?"

"వాళ్లే లేకపోతే మీరూ నేనూ ఇక్కడ ఉండేవాళ్లం కాదు కాబట్టి."

"నామ్‌దేవ్ బాబా పేరెప్పుడైనా విన్నారా?"

మౌళి ఇక తట్టుకోలేకపోయాడు. "మీ సోది వినే అవసరం నాకు లేదు. నేను వెళ్తున్నాను." తలుపు దగ్గరకు నడిచాడు మౌళి.

"అది రాదు"

తలుపు తియ్యడానికి ప్రయత్నిస్తున్న మౌళి భయంగా బాబా వైపు చూశాడు. బాబా గోడ దగ్గరున్న ఒక స్విచ్ నొక్కాడు. పక్కన గదిలో లైట్ వెలిగింది. కిటికీ లోనుంచి ఆ రూం వైపు చూశాడు మౌళి. లోపల ఒక చిన్న గదిలో ఒక కుందేలు పరిగెట్టుకుని వచ్చి గది మధ్యలో ఉన్న బుట్ట లో ఉన్న క్యారెట్ ముక్కలు తింటోంది.

మౌళికి ఏమీ అర్థం కాలేదు. "నాకీ ట్రీట్‌మెంట్ వద్దూ. ఏమొద్దు. నన్ను వెళ్లనివ్వండి" అన్నాడు.

మౌళి మాటలు పెద్దగా పట్టించుకోలేదు బాబా.

"మౌళి మీకో విషయం తెలుసా? డ్రగ్స్ కి బానిస అయిన వాళ్ల చేత డ్రగ్స్ మాన్పించడం కంటే కూడా సిగరెట్ మాన్పించడం చాలా కష్టమైన పని. నామ్ దేవ్ గారు మొదట్లో ముంబాయి అండర్ వరల్డ్ కి డాన్. కానీ కొన్నాళ్లకు అతను తన క్రిమినల్ యాక్టివిటీస్ కి స్వస్తి పలికి భగవంతుని సేవకు అంకితమయ్యారు. పూర్తిగా మారిపోయారు. కానీ చిన్నప్పుడెప్పుడో అలవాటయిన సిగరెట్ మాత్రం మానలేకపోయాడు. నామ్ దేవ్ గారి కొడుకు. ఆ రెండో ఫోటో లో ఉన్నారే అతను. గోవింద్ రావ్. తండ్రిని చూసి అలవాటు చేసుకున్నాడో లేదో తెలియదు. టీనేజర్ గా ఉన్నప్పుడే చైన్ స్మోకర్ గా మారాడు. ముప్పై ఏళ్లకే బిజినెస్ లో ఎన్నో ఎత్తులు ఎదిగాడు కానీ, సిగరెట్ కారణంగా చాలా చిన్నప్పుడే చనిపోయాడు. అతని జ్ఞాపకార్థమే నామ్ దేవ్ బాబా ఈ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. కోరుకున్న వాళ్లచే సిగరెట్ మాన్పించే ప్రోగ్రాం డిజైన్ చేశారు." నామ్ దేవ్ బాబా ఫోటోకి తలవంచి నమస్కారం చేశాడు బాబా.

"బాబా గారూ. ఈ సోదంతా వినడానికి నేనిక్కడికి రాలేదు. నాకు ట్రీట్‌మెంట్ వద్దు. నన్ను వదిలెయ్యండి."

"మొదలుపెట్టే ముందు మీరు కొన్ని విషయాలు తెలుసుకోవడం చాలా అవసరం. నన్ను నమ్మండి."

మౌనంగానిల్చున్నాడు మౌళి.

"సిగరెట్ అనేది చాలా ప్రమాదకరమైనది. మీకీ విషయం తెలుసా? జైల్లో ఖైదీలకు తినడానికి తిండి పెట్టకపోయినా, వాళ్లని చితకబాదినా భరిస్తారు. కానీ వాళ్లకి సిగరెట్లు దొరక్కుండా చెయ్యండి. జైల్లో సిగరెట్ల కోసం యుద్ధాలే జరుగుతాయి."

"బ్రైన్ వాష్. అర్థమైంది. ఇలాంటి విషయాలు చెప్పి బ్రెయిన్ వాష్ చేసి తన చేత సిగరెట్ మాన్పించాలనుకుంటున్నారు." అనుకున్నాడు మౌళి. తనకు రహస్యం అర్థమైపోయింది. యురేకా అని అరుద్దామనుకున్నాడు.

"మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీ లో సిగరెట్ల కొరత ఏర్పడినప్పుడు, పెద్ద పెద్ద ఆఫీసర్లు కూడా రోడ్ మీద సిగరెట్ పీకలు ఏరుకుని కాల్చేవారంట. మీకీ విషయం తెలుసా?"

"తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరం లేదు. ఇవన్నీ చెప్పి నాకు బ్రెయిన్ వాష్ చేసి సిగరెట్ మాన్పించాలనుకుంటే అది సాధ్యం కాదు."

"సాధ్యం కాదని తెలుసు కాబట్టే మేము ఒక ప్రత్యేక పద్ధతిని రూపొందించాం. రండి చూపిస్తాను," అంటూ కిటికీ దగ్గరకు నడిచాడు బాబా.

మౌళికి కుతూహలం ఎక్కువైంది. అతను కూడా కిటికీ దగ్గరకు నడిచాడు. బాబా జేబులోనుంచి రిమోట్ లాంటి ఒక పరికరాన్ని తీసి ఏవో బటన్స్ నొక్కాడు. లోపల గదిలో కుందేలు గాల్లోకి ఎగిరి కిందపడింది. లేచి క్యారెట్ తినడానికి బుట్ట దగ్గరకు వచ్చింది. మొదట్లో అక్కడేం జరుగుతుందో మౌళికి అర్థం కాలేదు. కుందేలు క్యారెట్ని తినడానికి ప్రయత్నించడం, బాబా బటన్ నొక్కడం, కుందేలు ఎగిరిపడడం. ఇలా కొంతసేపు జరిగాక మౌళికి అర్థమైంది. బాబా బటన్ నొక్కినప్పుడల్లా కుందేలు కరెంట్ షాక్ కి గురవుతోంది. మౌళి షాకయ్యాడు.

"ఆపండి" అరిచాడు మౌళి.

"మీకర్థమైందా మిస్టర్ మౌళి?"

భయంగా చూశాడు మౌళి.

"బాబా గారూ మీ పేరేంటో మర్చిపోయాను. ఐయామ్ సారీ. కానీ నేను చెప్పేది వినండి. మీరు నన్ను వెళ్ళనివ్వకపోతే ఇప్పుడే పోలీసులకు ఫోన్ చేస్తాను." ధైర్యం తెచ్చుకుని చెప్పాడు మౌళి.

"కుదరదు. ఈ ఆశ్రమంలో మొబైల్ ఫోన్ పని చెయ్యదు. అయినా మీరు అనవసరంగా భయపడ్తున్నారు. నేను చెప్పేది పూర్తిగా వినండి."

మౌళికి వేరే మార్గం కనిపించలేదు. తను పూర్తిగా ఇరుక్కు పోయాడన్న విషయం అర్థమైంది.

"ఆ కుందేలు చూశారు కదా! ఇంకో కొన్ని గంటల వరకూ అది క్యారెట్ల జోలికి పోదు. పోతే షాక్ కొడుతుందని దానికి తెలుసు. దీన్నే మేము అవెర్షన్ థెరపీ అంటాము."

"అర్థమైంది. మీరు నన్ను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారు కదా! కానీ మీకో విషయం అర్థం కావటం లేదు. నాకీ ట్రీట్మెంట్ అవసరం లేదు."

"అర్థం కానిది మీకు మిస్టర్ మౌళి. మీకు వేరే ఛాయిస్ లేదు. మీరు ఆల్రెడీ కాంట్రాక్ట్ సైన్ చేసేశారు."

"చేస్తే? నేనిక్కడ్నుంచి బయటకు వెళ్ళగానే ఒకటే సారి ఐదు ప్యాకెట్లు కాలుస్తాను. ఏం చేస్తారు?"

"మీరు అలా అనుకుంటూన్నారు కానీ, నేను చెప్పేది పూర్తిగా వింటే మీరు జీవితంలో సిగెరెట్ తాగరు. నా మాట నమ్మండి. ఈ ట్రీట్‌మెంట్ లో ప్రధానంగా మీరు మమ్మల్ని నమ్మాలి." ప్రశాంతంగా చెప్పాడు బాబా.

మౌళికి చిర్రెత్తుకొచ్చింది. బాబాని లాగి కొడదామనేంత కోపమొచ్చింది.

"నన్ను బయటకు పంపించి చూడండి. సిగెరెట్ తాగుతానో లేదో మీకే తెలుస్తుంది." కోపంగా అన్నాడు మౌళి.

"మీరా తప్పు చేయరు. ఇప్పట్నుంచి ఇంకో నెలరోజుల వరకూ ఇరవై నాలుగు గంటలు మా వాళ్లు మిమ్మల్ని అనుక్షణం గమనిస్తూనే ఉంటారు."

"అంటే సిగెరెట్ తాగితే నన్ను కూడా ఇక్కడకు తీసుకొచ్చి ఆ రూం లో బంధించి కరెంట్ షాకిస్తారా?"

"నో. మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. తప్పు నాదే. మీకు సరిగా అర్థమయ్యేలా చెప్పలేదు. మిమ్మల్ని ఏమీ చెయ్యము. మీరు ఈ గదిలోనే ఉంటారు. ఆ గది లోపల కుందేలు కి బదులు మీ భార్య స్వాతి ఉంటుంది."

మౌళికి గట్టిగా ఏడవాలనిపించింది. శ్రీకాంత్ మీద పిచ్చి కోపం తో ఫోన్ చేసి బండబూతులు తిడ్దామనుకున్నాడు. అనవసరంగా వచ్చి ఈ సైకో గాడికి దొరికిపోయానేంట్రా అనుకుని లోపల్లోపలే బాధపడ్డాడు. గదిలో కుందేలు వణుకుతూ ఒక మూల కూర్చుని ఉంది.

నివారణ్ ఆశ్రమం నుంచి బయటపడ్డాక చాలా సేపటివరకూ ఏం చెయ్యాలో తెలియలేదు మౌళికి. కారు లో ఇంటి వైపు బయల్దేరాడు. టెన్షన్ తో ఏసి కారులో కూడా చెమటలు పట్టేశాయి. వణుకుతున్న చేతులతో డ్రైవింగ్ చేయడమూ కష్టంగానే అనిపించింది. ఔటర్ రింగ్ రోడ్ లో కారు పక్కన ఆపి రైలింగ్ మీద కూర్చుని వచ్చే పోయే వాహనాలను చూస్తూ రెండు గంటలు గడిపేశాడు. ఎంత వద్దనుకున్నా అతనికి బాబా చెప్పిన మాటలే గుర్తొచ్చాయి.

"మొదటి తప్పు: మీ భార్య కు ఎలక్ట్రిక్ షాక్. రెండో తప్పు: మీకు ఎలక్ట్రిక్ షాక్. మూడో తప్పు: మీ ఇద్దరికీ కలిపి షాక్ ఇస్తాం. నాలుగో తప్పు: అంతదాకా మీరు తెచ్చుకోరనే నమ్మకం ఉంది. ఒకవేళ అంతదాకా వస్తే...మా వాళ్లు డైరెక్ట్ గా మీ అబ్బాయి స్కూల్ కి వెళ్లిపోతారు. ఆలోచించండి. పాపం అర్థం చేసుకునే వయసు కూడా కాదు. తండ్రి చేసిన తప్పుకి కొడుకు శిక్ష అనుభవించడం న్యాయమేనా?"

"మా కుటుంబం జోలికొస్తే నేనేం చేస్తానో నాకే తెలియదు." అని ఆవేశంగా బాబా కాలర్ పట్టుకున్నాడు మౌళి.

నెమ్మదిగా మౌళి చేతులనుంచి విడిపించుకుని, "ఇవన్నీ చెయ్యాలని మాకు సరదా కాదు మౌళి. మీ చేత సిగరెట్ మాన్పించడానికే మా ప్రయత్నాలన్నీ. మా దగ్గర ట్రీట్మెంట్ కి వచ్చిన వారిలోదాదాపు నలభై శాతం మంది ఒక్క తప్పూ చేయరు. ఒక పది శాతం మంది మాత్రమే మూడు, నాలుగు సార్లు మాకు దొరికిపోతారు. కాబట్టి మీరంత వర్రీ కానక్కర్లేదు."

ఆఫీస్ లో సేల్స్ మీటింగ్ లో తను ప్రెజెంట్ చేసే స్టాటిస్టిక్స్ గుర్తొచ్చాయి మౌళికి. అంత భయం లోనూ అతని మనసులో ఒక చిలిపి ప్రశ్న ఉదయించింది. "ఐదో తప్పు చేస్తే?" అని బాబాని అడుగుదామనుకున్నాడు. ఈ లోగా మౌళి మైండ్ రీడ్ చేసినట్టుగా బాబా మొదలు పెట్టాడు.

"ఐదో తప్పు నుంచి మేము విధించే శిక్ష చాలా ఘోరంగా ఉంటుంది. కొంతమంది ఉంటారు; చాలా తక్కువ శాతం అనుకోండి. వాళ్లు పదో తప్పు వరకూ వెళ్లిపోతారు. వాళ్ళని మార్చడం ఇక ప్రపంచంలో ఎవరి వల్లా కాదు." అని ఆగాడు బాబా.

"అంటే వాళ్లని వదిలేస్తారా?"

"వదిలెయ్యం. పంపించేస్తాం – పైకి" అని నవ్వుతూ చెప్పాడు బాబా.

"రేయ్ ఏంట్రా సిగరెట్ మానెయ్యకపోతే చంపేస్తారా? నేను బయటకెళ్లగానే మీడియా వాళ్లకి మీ గురించి చెప్పేస్తాను." ఆవేశంగా బాబా మీదకు వచ్చాడు.

బాబా ప్రశాంతంగా డెస్క్ తెరిచాడు. అందులోనుంచి ఒక రివాల్వర్ తీసి టీపాయ్ మీద పెట్టాడు. "మా గురించి బయటెక్కడైనా మాట్లాడారంటే అప్పుడు మాట్లాడేది నేను కాదు, ఈ రివాల్వర్."

మౌళి వెనక్కి తగ్గాడు. "అసలు ఇది ఆశ్రమమా? అండర్ వరల్డ్ డెన్నా?" అరిచాడు.

"రెండింటి కాంబినేషన్" చెప్పాడు బాబా.

మొబైల్ ఫోన్ రింగవుతున్న శబ్దంతో మళ్లీ ఈ లోకంలోకి వచ్చాడు మౌళి. ఇంటికెప్పుడొస్తారని అడగడానికి ఫోన్ చేసింది స్వాతి. ఇంకో అరగంటలో వచ్చేస్తానని చెప్పి బయల్దేరాడు మౌళి. దారి పొడుగునా అతనికి సిగరెట్ తాగుతూన్న జనాలే కనిపించారు. ఇంటికి చేరుకునే సరికి తొమ్మిదయింది. టివిలో గబ్బర్ సింగ్ సినిమా వస్తోంది.

"తిన్నారా?" టివి వైపు నుంచి తలతిప్పకుండా అడిగింది స్వాతి.

మౌళి సమాధానం చెప్పకుండా బెడ్ రూం లోకి వెళ్లిపోయాడు. లైట్ కూడా వేసుకోకుండానే బెడ్ మీద పడుకున్నాడు. "ఇరవై నాలుగు గంటలు మా వాళ్లు మిమ్మల్ని అనుక్షణం గమనిస్తూనే ఉంటారు." బాబా మాటలు గుర్తుకొచ్చాయి. కళ్ళు మూసినా, తెరిచినా సిగరెట్టే కనిపిస్తోంది మౌళికి. చేతులు వాసన చూసుకున్నాడు. ఎప్పుడూ ఉండే సిగరెట్ వాసన లేదు. "ఓ గాడ్. జస్ట్ వన్ సిగరెట్" అనుకున్నాడు మనసులో.

స్వాతి బెడ్ రూం లోకి వచ్చి లైటేసింది.

"ఏమైంది తాగొచ్చారా?"

మౌళి ఏం మాట్లాడలేదు. స్వాతి వచ్చి బెడ్ మీద కూర్చుంది.

"ఎందుకలా ఉన్నారు? ఫీవర్ గా ఉందా? ఆఫీస్ లో ఏమైనా ప్రాబ్లమా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఏం లేదు. కొంచెం తలనొప్పి గా ఉందంతే!" అని చెప్పి గోడ వైపు తిరిగి పడుకున్నాడు మౌళి.

రాత్రి సరిగ్గానిద్రపట్టలేదు మౌళికి. మధ్య మధ్యలో మెలుకువ వచ్చినప్పుడల్లా బాల్కనీలోకెళ్లి సిగెరెట్ వెలిగిద్దామనుకున్నాడు. మూడు గంటలకు మరోసారి మెలుకవ వచ్చింది. బాత్ రూం లోకి వెళ్లాడు. అక్కడ్నుంచి ఎవరూ తనని గమనించే అవకాశం లేదనుకున్నాడు. ఎప్పుడో అద్దం వెనుక వదిలేసిన సిగెరెట్ పెట్టె కనిపించింది. సిగెరెట్ తాగితే తప్ప ప్రశాంతంగా ఉండలేదు; పోనీ తాగేస్తే పోలా అనుకున్నాడు. ఒక వేళ బాబాగాడికి తెలిసిపోతే?

"మొదటి నెల రోజులు ఇరవై నాలుగు గంటలూ గమనిస్తూ ఉంటారు. ఆ తర్వాత రెండు నెలలు పద్దెనిమిది గంటలు. ఆ తర్వాత సంవత్సరం రోజుల పాటు పన్నెండు గంటలపాటు మిమ్మల్ని ఫాలో అవుతుంటారు మా వాళ్లు. ఆ తర్వాత? ఒక పద్ధతంటూ ఏమీ ఉండదు. కానీ జీవితాంతం ఏదో ఒక సమయంలో మిమ్మల్ని మా వాళ్లు గమనిస్తూనే ఉంటారు."

బాబా మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. బయట ఏదో అలికిడి అయినట్టు అనిపించింది.నిజంగానే 24 గంటలు ఫాలో అవుతారా? ఇంట్లోకి ఎలా రాగలరు? సీక్రెట్ గా కెమెరాలేమైనా పెట్టి ఉంటారా? మౌళికి పిచ్చెక్కిపోయింది. సిగెరెట్ లేకుండా ఉదయంనిద్ర లేవడం ఎలా? ఆఫీస్ లో టెన్షన్ తట్టుకోవడం ఎలా? పార్టీ లో మందు తాగడమెలా? సిగెరెట్ చుట్టూ తన జీవితం అల్లుకుపోయిందే! ఇప్పుడు సిగెరెట్ లేకుండా ఎలా? అనుకున్నాడు. కానీ తప్పదని తెలుసు. స్వాతిని కుందేలు గదిలో ఊహించుకోలేకపోయాడు. ముద్దొచ్చే రఘు మొహం గుర్తొచ్చింది. వెంటనే సిగెరెట్ ప్యాకెట్ని అద్దం వెనకాల పెట్టేశాడు.

మౌళి ఉదయాన్నేనిద్రలేచే సరికి బాగా లేటయింది. బ్రష్ చేసుకుని కిచెన్ లోకి వచ్చాడు.

"ఆకలేస్తోంది టిఫిన్ పెట్టు" అన్నాడు.

స్వాతి ఆశ్చర్యపోయింది. ఉదయం లేచి గంట సేపు బాల్కనీ లో కూర్చుని, పేపర్ చదువుతూ రెండు కాఫీలు తాగి, నాలుగు సిగెరెట్లు కాల్చందే కనీసం బ్రష్ చెయ్యని మౌళి, సరాసరి టిఫిన్ పెట్టమని అడగడం నమ్మలేకపోయింది.

"ఏమైంది మీకు?" ఇడ్లీ ప్లేట్ అందిస్తూ అడిగింది

"ఏం లేదు."

"లేదు. ఏదో దాస్తున్నారు మీరు.నిన్నట్నుంచీ అదోలా ఉన్నారు."

"ఏం లేదని చెప్పానుగా!" కొంచెం గట్టిగానే అన్నాడు మౌళి. మూతి ముడుచుకుని వెళ్లిపోయింది స్వాతి.

ఇడ్లీ తినడం అయ్యాక, హాల్లో కూర్చుని టివి చూస్తున్న స్వాతి పక్కన కూర్చున్నాడు.

"ఇప్పుడైనా చెప్పండి" అంది స్వాతి.

"అదీ...నేను సిగెరెట్ మానేద్దామనుకుంటున్నాను."

"అవునా? మొన్నీ మధ్యే ఒకసారి మానేసినట్టున్నారు."

"జోక్ కాదు.నిజంగానే!" అన్నాడు మౌళి.

"మంచిదేగా. ట్రై చెయ్యండి." అని అక్కడ్నుంచి లేచి వెళ్లిపోయింది స్వాతి. మౌళి కూడా ఆమె వెంటే నడిచాడు.

"నిజం చెప్తున్నాను. ఇంకెప్పుడూ సిగెరెట్ తాగను." మౌళి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"మీరు సిగెరెట్ మానేస్తే అంతకంటే సంతోషం ఏదీ ఉండదు." మౌళి చెయ్యి పట్టుకుని చెప్పింది స్వాతి. ఆమెను గాఢంగా హత్తుకున్నాడు.

ఆ తర్వాత గడిచిన రెండు నెలల్లో, మౌళి జీవితంలోని కొన్ని సంఘటనలు:

మౌళి బార్ లో కొలీగ్ తో కలిసి మందు తాగుతున్నాడు. కొలీగ్ సిగెరెట్ వెలిగించాడు. నీకొద్దా అని అడిగాడు. తాగుతున్న విస్కీ గ్లాస్ని గట్టిగా పట్టుకుంటూ మానేశానన్నాడు మౌళి. ఎన్నోసారి అని జోక్ చేశాడు కొలీగ్.

మౌళి ఆఫీస్ కి బయల్దేరాడు. కారు కొంచెం ముందుకెళ్లాక రేర్ వ్యూ మిర్రర్ లో చూశాడు. నల్ల చొక్కా వేసుకున్న వ్యక్తి బైక్ మీద బయల్దేరాడు. అతన్ని చూడడం రోజూ అలవాటయిపోయింది మౌళికి. సూపర్ మార్కెట్ లో, ఆఫీస్ దగ్గర బార్ లో, ఉదయం రఘు, స్వాతిలను స్కూల్ లో దింపేటప్పుడు, ఆదివారం పూట రఘుని ప్లే గ్రౌండ్ లో ఆడించేటప్పుడు... అదే నల్ల చొక్కా, కూలింగ్ గ్లాసెస్, హోండా బైక్.

మౌళి ఆఫీస్ పార్టీలో చిత్తుగా తాగేశాడు. అందరూ సిగెరెట్ తాగుతుంటే తనకీ తాగాలనిపించింది. కానీ బాబా గుర్తుకు రావడంతో దెబ్బకి మత్తు దిగిపోయింది.

మౌళి సూపర్ మార్కెట్ లో స్వాతి తో షాపింగ్ చేస్తున్నాడు. బిల్లింగ్ కౌంటర్ దగ్గరకు రాగానే అక్కడ ఒక ర్యాక్ లో అందంగా అమర్చి ఉన్న సిగెరెట్ ప్యాకెట్స్ వైపు చూశాడు. సూపర్ మార్కెట్ బయటనిల్చున్న సెక్యూరిటీ గార్డ్ తన వైపే చూస్తుండడం గమనించాడు మౌళి.

మౌళి ఆఫీస్ నుంచి త్వరగా బయల్దేరి రఘు స్కూల్ దగ్గరకు వచ్చాడు. రఘుని స్కూల్ నుంచి పికప్ చేసుకునే పని తనకప్పచెప్పి మధ్యాహ్నమే ఇంటికి వెళ్లిపోయింది స్వాతి. మౌళి వెళ్లే సరికే స్కూల్ వదిలేశారు. బిక్కు బిక్కుమంటూ ఒక్కడే స్కూల్ బయట ఎదురుచూస్తున్నాడు రఘు. మౌళిని చూడగానే ఏడ్చేశాడు. రఘుని సముదాయించి గట్టిగా హత్తుకున్నాడు మౌళి. ఆ క్షణంలో మౌళికి నివారణ్ ఆశ్రమం వారి రహస్యం తెలిసొచ్చింది : ప్రేమను మించిన వ్యసనం లేదు. భయాన్ని మించిన మందూ లేదు. అందుకే సిగెరెట్ వ్యసనాన్ని మాన్పించడానికి తనమీద భయాన్ని ప్రయోగించారు. “Perfect paranoia is perfect awareness” అని బాబా చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.. కానీ మొదటిసారిగా అతనిమీద కోపం రాలేదు.

మెల్లమెల్లగా సిగెరెట్ మీద నుంచి మనసు మళ్లించగలిగాడు మౌళి. ఇంతకుముందులా సిగెరెట్ తాగాలనిపించినప్పుడల్లా అనిపించే ఇబ్బంది క్రమంగా తగ్గుముఖం పట్టింది. కానీ సిగెరెట్ తాగాలనే కోరిక మాత్రం పూర్తిగా పోలేదు. లవంగం, చూయింగ్ గమ్, టూత్ పిక్... ఏదో ఒకదాంతో కోరికను చల్లారుస్తున్నాడు.

ఒక రోజు రాత్రి ఆఫీస్ లో పని ముగించుకుని చేసి ఇంటికి బయల్దేరాడు. ఒక వైపు బాగా అలసట. మరోవైపు కిలోమీటర్లకొద్దీ ట్రాఫిక్ జామ్. హారన్ ల మోత. ఉక్కపోత. ట్రాఫిక్ చాలా నెమ్మదిగా కదుల్తోంది. పాటలైనా విందామని డాష్ బోర్డ్ ఓపెన్ చేశాడు. మంచి సిడి కోసం వెతుకుతుండగా, రెండు సిడిల మధ్య కనిపించిందొక సిగెరెట్ ప్యాకెట్. మౌళికి స్వాతి మీద కోపమొచ్చింది. ఇంట్లో ఎక్కడా సిగెరెట్లు కనిపించకుండా చెయ్యమని చెప్పాడు. కార్లో మర్చిపోయినట్టుంది అనుకున్నాడు. సిగెరెట్ ప్యాకెట్ లోనుంచి ఒక సిగెరెట్ తీశాడు. లోపల లైటర్ కూడా ఉంది. కారు విండోస్ కిందకు దించి సిగెరెట్ వెలిగించాడు.

ఒక పఫ్ తాగగానే దగ్గు పొరలు పొరలుగా తన్నుకొచ్చింది. రెండో పఫ్ తాగగానే కళ్లల్లోనుంచి నీళ్లు పొర్లుకొచ్చాయి. మూడో పఫ్ కి అంతా మామూలుగా అనిపించింది కానీ, గొంతులో చేదుగా తగిలింది. సిగెరెట్ టేస్ట్ ఇంత చెత్తగా ఉంటుందా అనుకుంటూ మరో పఫ్ తాగుదామనుకుంటుండగా. . .

"షిట్. షిట్. షిట్" అనుకున్నాడు. సిగెరెట్ని బయటపడేశాడు. "ఏం చేశాను నేను? ఓ మై గాడ్!" వెంటనే కారు కిటికీలన్నీ కిందకు దించి, పెర్ఫ్యూమ్ స్ప్రే చేశాడు. మౌళికి ఒక్కసారిగా భయమేసింది. మొబైల్ ఫోన్ తీసి ఇంటికి ఫోన్ చేశాడు. స్వాతి ఆన్సర్ చేసింది. ఎక్కడికీ వెళ్లొద్దు. నేను పదిహేనునిమిషాల్లో వస్తున్నానని చెప్పి పెట్టేశాడు. మళ్లీ ఫోన్ చేసి రఘు ఎక్కడున్నాడని అడిగాడు. ఏమైందని అడిగింది స్వాతి. ఏం లేదు అందరం డిన్నర్ కి బయటకెళ్దామని అబద్ధం చెప్పాడు.

ఇంటికి చేరుకోగానే లిఫ్ట్ కోసం ఎదురుచూడకుండా మెట్లెక్కి హడావుడిగా తన ఫ్లాట్ వద్దకు పరిగెత్తాడు. కాలింగ్ బెల్ నొక్కాడు. ఎవరూ రాలేదు. మళ్లీ కొట్టాడు. అయినా రాలేదు. రఘుకి స్నానం చేపిస్తుందేమో అనుకున్నాడు. రెండునిమిషాలు అయ్యాక మళ్లీ కాలింగ్ బెల్ నొక్కాడు. ఫోన్ తీసి స్వాతి మొబైల్ కి రింగ్ చేశాడు. రింగవుతుంది కానీ ఎవరూ లిఫ్ట్ చెయ్యలేదు. తనదగ్గరున్న తాళం చెవితో డోర్ ఓపెన్ చేసి లోపలకి పరిగెత్తాడు మౌళి. స్వాతి, రఘు ఇద్దరూ కనిపించలేదు. అన్ని రూములూ మరోసారి వెతుకుతుండగా మౌళి ఫోన్ రింగయింది.

"హలో మౌళి"

"బాబా?"

"యెస్. మీకు ఇప్పుడు ఆశ్రమం రావడానికి వీలవుతుందా? లేకపోతే రాత్రికి హాయిగా పడుకుని రేపు ఉదయం రావొచ్చు."

"స్వాతి ఎక్కడ?" కోపంగా అడిగాడు మౌళి.

"ఎక్కడుందో నీకు తెలుసు"

"బాబా ప్లీజ్ నా మాట వినండి. తప్పైపోయింది. ఒప్పుకుంటున్నాను. నన్ను క్షమించండి."

"మీరు ఆశ్రమంకొస్తే అన్నీ వివరంగా మాట్లాడొచ్చు. మీరు రండి ముందు." అన్నాడు బాబా.

"బాబా ప్లీజ్ వాళ్ళనొదిలేయండి. నేను పూర్తిగా కూడా తాగలేదు. జస్ట్ మూడు పఫ్స్ అంతే!" దీనంగా చెప్పాడు మౌళి. అప్పటికే బాబా అవతల ఫోన్ కట్ చేశేసాడు.

మౌళి ఆశ్రమం చేరుకునే సరికి తొమ్మిది దాటింది. రిసెప్షన్ లో అంతకుముందు చూసిన రిసెప్షనిస్ట్ లేదు. ఏం అడగాలో తెలియలేదు మౌళికి. బాబా పేరు గుర్తుకు రాలేదు. "నా వైఫ్..." అని ఏదో అడబోతుండగా "మిస్టర్ మౌళి" అని ఎవరో పిలవడంతో అటువైపు చూశాడు. ఇద్దరు బాడీ బిల్డర్స్ లాంటి వాళ్లు డోర్ బయటనిలబడి ఉన్నారు. "ప్లీజ్ కమ్" అన్నాడు వాళ్లల్లో ఒకడు.

గదిలోకి వెళ్లేసరికి కిటికీ దగ్గరనిల్చుని ఉన్నాడు బాబా. మౌళి అతని దగ్గరకు పరిగెత్తాడు. పక్క గదిలో ఒక కుర్చీలో కూర్చుని ఉంది స్వాతి. "సార్ ప్లీజ్. ఆమెనేం చెయ్యొద్దు. కావాలంటే ఫైన్ కడతాను. మీరేం చెయ్యమంటే అది చేస్తాను. ప్లీజ్ వదిలెయ్యండి." అని వేడుకున్నాడు మౌళి. బాబా సమాధానం చెప్పలేదు. కిటికీ దగ్గరకు వెళ్లి, "స్వాతీ! స్వాతీ" అని అరిచాడు.

"అది వన్ వే మిర్రర్. రూం కూడా సౌండ్ ప్రూఫ్. నువ్వు కనిపించవు. నీ మాటలు వినిపించవు" చెప్పాడు బాబా.

"రఘు ఎక్కడ?" కోపంగా అడిగాడు మౌళి.

"నిద్రపోతున్నాడు. డోంట్ వర్రీ. మొదటి తప్పు కాబట్టి అతన్ని ఏం చెయ్యము. మన కాంట్రాక్ట్ లోనియమనిబంధనల ప్రకారమే మేము పనిచేస్తాం. మొదలు పెడ్దామా?" అంటూ జేబులోనుంచి రిమోట్ తీశాడు బాబా.

"వద్దు. స్వాతిని ఏం చెయ్యొద్దు." ఆవేశంగా బాబా మీదకి దూకాడు. అక్కడనిల్చుని చూస్తున్న బాడీ బిల్డర్స్ ఇద్దరూ మౌళి పట్టుకుని వెనక్కి లాగారు.

మౌళి వాళ్లని విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ, "స్వాతికేమైనా జరిగిందంటే చంపేస్తాను" అన్నాడు.

"ఈ మాట నేను ఇక్కడ చేరినప్పట్నుంచి రోజూ వింటున్నాను. నా మీద కోప్పడ్డ ప్రతి ఒక్కడూ ఒక్కో రూపాయిచ్చుంటే ఈ పాటికి నా బ్యాంక్ లో లక్షల దబ్బుండేది. అయినా ఇదంతా ఎందుకు చేస్తున్నాం? నీ మంచి కోసమే కదా! సిగరెట్ మాన్పించి మీ ప్రాణాలు కాపాడాలని మేమనుకుంటున్నాం. మీరేమో నన్ను చంపేస్తానంటున్నారు. ఈజిట్ ఫెయిర్? మీరే చెప్పండి."

మౌళిని కదలకుండా పట్టుకున్నారు.

బాబా రిమోట్ లో బటన్ నొక్కబోతూ, వెనక్కి తిరిగి," భయపడొద్దు. కేవలం ముప్పై సెకండ్లే" అని బటన్ నొక్కాడు.

ఆ ముప్పై సెకండ్లు ముప్పై యుగాలుగా అనిపించింది మౌళికి. లోపల గదిలో ఎలక్ట్రిక్ షాక్ కి స్వాతి నరకయాతన అనుభవించింది. చూడలేక కళ్లు మూసుకున్నాడు మౌళి.

బాబా వచ్చి భుజం మీద తట్టాడు. "అయిపోయింది. మీరెళ్లి మాట్లాడొచ్చు."

"ఏం మాట్లాడాలి. అసలు తనకు నా మొహం ఎలా చూపించగలను?" గట్టిగా ఏడ్చేశాడు మౌళి. అప్పటివరకూ మౌళిని పట్టుకున్న వాళ్లు అతన్ని వదిలేసి బయటకు వెళ్లిపోయారు.

"మీరనుకుంటున్నట్టు ఏమీ జరగదు. వెళ్లండి" అన్నాడు బాబా.

నిద్రపోతున్న రఘుని భుజాన వేసుకుని మౌళి గదిలోకి వెళ్లగానే స్వాతి పరిగెత్తుకుని వచ్చింది. "ఏమండీ మీకేం కాలేదు కదా? ఎవరో ఇద్దరు వచ్చి మీకు యాక్సిడెంట్ అయిందని తీసుకొచ్చి- - -." స్వాతి మాట్లాడలేకపోయింది.

"ఇంకేం ఫర్వాలేదు. నేనొచ్చేశాను." అన్నాడు మౌళి.

"నేనిక్కడున్నానని మీకెలా తెలిసింది. అసలెవరు వీళ్లు?" తడబడుతూ అడిగింది.

"ఐ యాం సారీ స్వాతి. ఇదంతా నావల్లే!"

"అసలిదంతా ఏంటండీ. నాకేం అర్థం కావటం లేదు." అంది స్వాతి ఏడుస్తూ.

మౌళి జరిగిందంతా చెప్పాడు. అంతా విన్న స్వాతి కాసేపు మౌనంగా ఉండిపోయింది. "నాకు తెలుసు నేను చాలా పెద్ద తప్పు చేశాను. ఇంకోసారి చెయ్యను. నన్ను క్షమించు" అన్నాడు మౌళి.

స్వాతి ఏం మాట్లాడలేదు. "నా మీద అసహ్యంగా ఉంది కదా!" అన్నాడు.

"లేదు. ఇదంతానిజమైతే వీళ్లు చాలా మంచి పని చేశారు. మీ చేత సిగరెట్ మాన్పించారంటే అదే చాలు."

మౌళి ఆశ్చర్యపోయాడు.

ఇది జరిగిన కొన్ని నెలలకు బాబా నుంచి ఫోనొచ్చింది. “హలో” అనగానే బాబా గొంతు గుర్తుపట్టాడు మౌళి. “మీ వాళ్లు ఎవర్నో చూసి నన్నునుకుని ఉంటారు. నేనసలు ఆ రోజునుంచి సిగెరెట్ వైపే చూడలేదు.” అన్నాడు మౌళి కంగారు పడుతూ.

“నోనో అలాంటిదేం లేదు. మీ ట్రీట్‌మెంట్ లో ఇంకొంత భాగం మిగిలుంది. రేపు ఒక సారి ఆశ్రమం కి రాగలరా?” అడిగాడు బాబా.

“వస్తాను”

“బైదివే. కంగ్రాచ్యులేషన్స్ ఆన్ యువర్ ప్రమోషన్.”

“మీకెలా తెలుసు?”

“మిమ్మల్ని ఇంకా ఫాలో అవుతున్నాం మిస్టర్ మౌళి” అని ఫోన్ పెట్టేశాడు బాబా.

బాబా ఏం లేదని ధైర్యం చెప్పినా ఆశ్రమం లోకి అడుగుపెట్టే సరికి ఒళ్ళంతా చల్లగా అయిపోయింది మౌళికి. అంతకుముందు తీసుకెళ్లిన రూం లోకి కాకుండా డాక్టర్ కన్సల్టింగ్ రూం లాంటి దాంట్లోకి తీసుకెళ్లారు. అక్కడున్న వెయింగ్ మెషీన్ మీద నిల్చోబెట్టి వెయిట్ చూశారు.

“ఈ మధ్య నేను కొంచెం వెయిట్ పెరిగాను” అన్నాడు మౌళి.

“తెలుసు. మా దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకున్న వారిలో డెబ్బై నాలుగు శాతం మందికి ఈ సమస్య ఎదురవుతుంది. అక్కడ నిల్చోండి. మీ హైట్ చెక్ చేద్దాం” అన్నాడు బాబా.

మౌళి, హైట్, వెయిట్ నోట్ చేసుకుని పక్కనే ఉన్న కంప్యూటర్ లో ఫీడ్ చేశాడు.

“మీరు మరీ ఓవర్ వెయిట్ లేరు. కానీ కంట్రోల్ లో ఉంచుకుంటే మంచిది. నేను మీకు కొన్ని టాబ్లెట్స్ రాసిస్తాను. అవసరమనిపిస్తేనే వాడండి. ప్రతి నెలా ఒకటో తేదీ మీ హైట్ అండ్ వెయిట్ చెక్ చేస్తాం. మీ బాడీ మాస్ ఇండెక్స్ ప్రకారం మీరు 77 కేజీలు దాటకూడదు.”

“దాటితే?” టక్కున అడిగేశాడు మౌళి.

బాబా నవ్వాడు. “మా వాళ్లు ఎవరో ఒకరు మీ ఇంటికి వచ్చి మీ భార్య చిటికెన వేలుని కోసేస్తారు.” అన్నాడు. మౌళికి ఎలా రియాక్టవ్వాలో అర్థం కాలేదు.

ఎనిమిది నెలల తర్వాత :

మౌళి ఒక రోజు ఆఫీస్ దగ్గర బార్లో కూర్చుని విస్కీ తాగుతున్నాడు. సిగరెట్ గురించి ఆలోచన కూడా లేదతని మనసులో. మౌళి ఎప్పటికంటే ఫిట్ గా ఉన్నాడు. టీ షర్ట్ లోనుంచి బయటకొస్తున్న పొట్ట మాయమై చాలా రోజులయింది. వారానికి ఐదు రోజులు వాకింగ్, వీకెండ్స్ లో జిమ్ లో చేసే వర్కవుట్ మౌళికి బాగా పనిచేసింది. ఇంతలో ఆఫీస్ కొలీగ్ ఒకతను వచ్చి పక్కనే కూర్చున్నాడు.

కొలీగ్: "మౌళి, నువ్వు సిగరెట్ మానేశావంటే నమ్మలేక పోతున్నాను.నేను ట్రై చేసి చేసి వదిలేశాను. నాక్కూడా కొంచెం హెల్ప్ చెయ్యొచ్చు కదా!" అంటూ సగం సిగరెట్ని యాష్ ట్రేలో పడేశాడు.

"నువ్వునిజంగానే సిగరెట్ మానెయ్యాలనుకుంటున్నావా?

అవునన్నట్టు తలూపాడు కొలీగ్.

మౌళి జేబులోనుంచి పర్స్ తీశాడు. శ్రీకాంత్ ఇచ్చిన నివారణ్ విజిటింగ్ కార్డ్ని కొలీగ్ కి ఇచ్చాడు., "వీళ్లని కాంటాక్ట్ చేయండి. మీరు కొద్ది రోజుల్లోనే సిగరెట్ మానేస్తారు."

పన్నెండు నెలల తర్వాత :

మౌళి ఇంటికి కొరియర్ లో ఒక కవర్ వచ్చింది. తెరిచి చూస్తే లోపల ఒక బిల్లు ఉంది.

నివారణ్

మహేశ్వరం గ్రామం, శ్రీశైలం హైవే.

1 ట్రీట్మెంట్: 25000.00

2 కౌన్సిలర్ (బాబా కృష్ణ దేవ్): 25000.00

3 కరెంట్ ఛార్జీలు: 2.90

చెల్లించవలసిన మొత్తం: రూ 50002.90 పైసలు

"ఎలక్ట్రిసిటీ ఛార్జీలు కూడా వేశారు దొంగ వెధవలు." అన్నాడు మౌళి.

"ఫర్వాలేదు కట్టెయ్యండి. మీరు మొత్తానికి సిగరెట్ మానేశారు కదా! అది చాలు" అంది స్వాతి.

ఇరవై నెలల తర్వాత:

ప్రసాద్ ఐమ్యాక్స్ లో సినిమా చూడ్డానికి వెళ్తే అనుకోకుండా శ్రీకాంత్ కలిసాడు అక్కడ. పండగకి అత్తారింటికి వచ్చానని చెప్పాడు. పోయిన సారి శ్రీకాంత్ని కలిసినప్పటికంటే ఈ సారి కొంచెం ఒళ్లు చేసినట్లనిపించింది మౌళికి. శ్రీకాంత్ తో పాటు అతని భార్య లత కూడా వచ్చింది. మౌళి ఎప్పుడూ ఆమె గురించి వినడమే కానీ కలవడం అదే మొదటి సారి. “నైస్ టు మీట్ యూ” అని హ్యాండ్ షేక్ చేసింది లత. ఏదో తేడాగా అనిపించింది మౌళికి.

హాల్లో సినిమా చూస్తూ, సమోశా తింటుండగా అర్థమైంది మౌళికి – లత కుడి చేతికి చిటికెన వేలు లేదని.

★

— మీ స్పందన ఇక్కడ తెలియజేయండి —

For Latest Telugu Books - Visit now:
Kinige.com